క్లుప్తంగా

వాసవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

నందిగామ: పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శనివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారి ఆలయ 21 వ వార్షికోత్సవంలో భాగంగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆ తర్వాత హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. ఆయా పూజా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాలభైరవుడికి పూజలు



నందిగామ: అష్టమి తిధి రోజున కాలభైరవుడిని పూజిస్తే కష్టాలు తొలుగుతాయని ప్రజల నమ్మకం. ఈ నేపథ్యంలో అష్టమి శనివారం కలసి రావడంతో మండలంలోని పలు ఆలయాల్లో కాలభైరవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో గల కాలభైరవ ఉపాలయంలో స్వామి వారికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అదేవిధంగా మండలంలోని సోమవరం, మాగల్లు, అడవిరావులపాడు, అంబారుపేట గ్రామాల్లోని శివాలయాల్లో గల కాలభైరవుడి ఉపాలయాల్లో విశేష పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో జరిగిన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు



పెనుగంచిప్రోలు:విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకోవాలని పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు గ్రంథాలయాధికారులు ఇంజం మధు, మధుబాబు అన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం విద్యార్థులతో కథలు చదివించటం, నీతి వాఖ్యాలు చెప్పించటంతో పాటు కార్టూన్లు, గ్రంథ పఠనం వలన కలిగే లాభాలను వివరించారు. కథల పుస్తకాలు చదవటం, వినటం వలన నైతిక విలువలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు వినియోగించుకోవాలి



కొణకంచి(పెనుగంచిప్రోలు):ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కె.వాణి తెలిపారు . ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వాణి మాట్లాడుతూ వేసవిలో ఎండ తీవ్రత నుంచి కాపాడుకోవటానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంచి శక్తినిచ్చే ఆహారం తీసుకోవటంతో పాటు తగినంత నీరు తాగాలన్నారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. యోగాసనాలపై గ్రామస్తులకు అవగాహన, శిక్షణ నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది, గ్రామపెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నందిగామలో బైక్ ర్యాలీ



నందిగామ: హనుమత్ జయంతిని పురస్కరించుకొని శనివారం సాయంత్రం నందిగామ పట్టణంలో భారీ బైక్ ర్యాలీ జరిగింది. పట్టణానికి చెందిన మహంకాళి వెంకన్న గురుస్వామి ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ బజార్ నుంచి భారీగా తరలివచ్చిన వాహనాలతో పట్టణంలోని పలు ప్రధాన వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

నందిగామ: గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్‌ఐ పండు దొర తెలిపిన సమాచారం ప్రకారం... చందర్లపాడు మండలం పాత బెల్లంకొండవారిపాలెం గ్రామానికి చెందిన చిరుమామిళ్ల నరసింహారావు (65) ఏప్రిల్ నెల 30వ తేదీన మోపెడ్‌పై నందిగామ వస్తున్నాడు. ఆ సమయంలో లింగాలపాడు సమీపంలోకి రాగానే వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో గాయపడ్డ నరసింహారావు అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



ఏఎంసీలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: మట్టిని, పంటను మాత్రమే నమ్ముకుని వ్యవసాయం చేస్తున్న రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రకాలుగా అండగా ఉండి ఆపన్న హస్తమందిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ముందుగా అకాల వర్షాలకు నష్టపోయిన పంట వివరాలను వ్యవసాయాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ రైతు బాగుంటేనే రాష్ట్రం బావుంటుందని నమ్మిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు.

దళారులను ఆశ్రయించి నష్టపోవద్దు..

మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ పంటలను విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. మొక్కజొన్న క్వింటాకు రూ. 1962 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. దళారులను నమ్మి అయినకాడికి తక్కువ ధరకు విక్రయించి నష్టాల పాలు కావద్దని చెప్పారు. రైతుల మంచి కోరే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. రైతులు అధైర్య పడొద్దని రైతులు పండించిన ప్రతి గింజ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. గ్రామాల్లో ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకుని ప్రభుత్వం అందించే మద్దతు పొందాలని కోరారు.

పంట నష్ట వివరాలను నమోదు చేయాలి..

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన పంట వివరాలను నమోదు చేసి ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు నివేదికలు పంపాలని వ్యవసాయాధికారులను ఎమ్మెల్యే జగన్‌మోహనరావు ఆదేశించారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగపూడి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ కోవెలమూడి వెంకట నారాయణ, నాయకులు వైఎస్ఎస్ ప్రసాద్, కందుల నాగేశ్వరరావు, గింజుపల్లి రవి, గరికపాటి భాస్కరం, పాములపాటి రమేష్, గుడివాడ సాంబశివరావు, పాకాలపాటి కిరణ్, తానూరి రాము, యాకుబ్ అలీ, బాపట్ల సాంబయ్య, కత్రి రవీంద్ర, పట్నా శ్రీను, దాసు, పిల్లి జయరాజు, హనుమంతు శ్రీనివాసరావు, కరిముల్లా, వ్యవసాయాధికారి ఖాశీం, మస్తాన్, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం



మాట్లాడుతున్న న్యాయమూర్తి శోభారాణి



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జిల్లా 16వ అదనపు న్యాయమూర్తి శ్రీనివాసరావు

జూనియర్ సివిల్ జడ్జి ఎం.శోభారాణి

జగ్గయ్యపేట అర్బన్: రాజీమార్గం ద్వారా కక్షిదారులకు ఎంతో మేలు జరుగుతుందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.శోభారాణి అన్నారు. స్థానిక కోర్టులో మండల న్యాయసేవాధికార సంస్థ జగ్గయ్యపేట వారి ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు కేసులను విచారించి పరిష్కరించారు. అనంతరం శోభారాణి మాట్లాడుతూ రాజీమార్గం వలన ఎంతో విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. పట్టుదలకు, పంతాలకు పోయి సంవత్సరాల తరబడి న్యాయస్థానాల చుట్టూ తిరుగుట వలన చివరకు సాధించేది ఏమిలేదన్నారు. నేరాలకు, అల్లర్లకు పాల్పడకుండా గ్రామాల్లో శాంతియుత వాతావరణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కాగా ఈ లోక్ అదాలత్‌లో మొత్తం 950 కేసులు పరిష్కారం కాగా వాటిలో పోలీసు కేసులు 933, సివిల్ కేసులు 7, బ్యాంకు పీఎల్‌సీ కేసులు 6, చెక్ బౌన్స్ 1, మనోవర్తి కేసులు 3 నమోదైనట్లు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాక కాంతారావు, ఏజీపీ టీఎల్.నర సింహారావు, బ్యాంకుల ప్రతినిధి స్టాలిన్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ జి.లక్ష్మీనారాయణ, ఇతర న్యాయవాదులు, బ్యాంకు అధికారులు, కక్షిదారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

1508 కేసులు పరిష్కారం...

నందిగామ:లోక్ అదాలత్‌ల ద్వారా కక్షిదారులు కేసులను సత్వరం పరిష్కరించుకోవాలని జిల్లా 16వ అదనపు కోర్ట్ న్యాయమూర్తి వి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక కోర్టుల ఆవరణలో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ లోక్ అదాలత్‌ల ద్వారా సత్వర న్యాయం అందుతుందని చెప్పారు. దీనివల్ల కక్షిదారుల సమయం, సొమ్ము ఆదా అవుతాయన్నారు. ఇరు వర్గాలు రాజీపడితే లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చునని, ఒకే రోజులో కేసుకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమం కక్షిదారులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అనంతరం నాలుగు బెంచ్‌లు ఏర్పాటు చేసి న్యాయమూర్తులు వి.శ్రీనివాసరావు, వి.లక్ష్మీరాజ్యం, పి.తిరుమలరావు, ఎస్.కె రియాజ్ లోక్ అదాలత్ నిర్వహించారు. మొత్తం 1508 కేసులు పరిష్కారం కాగా ఆయా కేసుల ద్వారా రూ రూ.2,04,96,620 నష్టపరిహారాన్ని అందజేశారు.

నిష్పక్షపాతంగా సర్వే నిర్వహించాలి

వీరులపాడు:రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా భూముల రీ సర్వే నిర్వహించాలని తహసీల్దార్ ఆశయ్య నాయక్ పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం, గూడెంమాధవరం, జయంతి గ్రామాల్లో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంలో భాగంగా భూముల రీ సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆశయ్యనాయక్ మాట్లాడుతూ భూముల రీ సర్వేను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. సిబ్బంది నిష్పక్షపాతంగా సర్వే నిర్వహించాలని సూచించారు. రైతుల నుంచి ఏవైనా అభ్యంతరాలు వస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని చిన్నారికి గాయాలు

నందిగామ:రోడ్డు ప్రమాదంలో ఓ చిన్నారికి గాయాలైన ఘటన మండలంలోని మాగల్లు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సోమేశ్వరరావు తెలిపిన సమాచారం ప్రకారం ..మాగల్లు గ్రామానికి చెందిన ఏడేళ్ల వయస్సున్న దేశపోగు ఆకాష్ అనే చిన్నారి ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా అటుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆకాష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నందిగామ ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం చిన్నారిని విజయవాడ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు సంఘ భవనానికి శంకుస్థాపన

జగ్గయ్యపేట అర్బన్:పట్టణంలోని కోదాడ రోడ్‌లో ది జగ్గయ్యపేట గోపాలకృష్ణ విశాల సహకార పరపతి సంఘ భవనం, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన జరుగుతుందని సొసైటీ చైర్‌పర్సన్ కోలపల్లి వెంకటేశ్వరరావు (బుల్లిబాబు) శనివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. అలాగే కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మార్కెట్ యార్డు చైర్మన్ ముత్తినేని విజయశేఖర్ తదితరులు పాల్గొంటారన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం



విద్యార్థులకు కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇస్తున్న శిక్షకురాలు

జగ్గయ్యపేట అర్బన్:పట్టణంలోని జిల్లా గ్రేడ్-1 స్థాయి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. పలువురు ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు పలు అంశాల గురించి బోధిస్తూ వాటికి సంబంధించిన విజ్ఞానం పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శనివారం 6 వ రోజు విద్యార్థులచే కథల పుస్తకాలను చదివించి సుమతీ, వేమన శతక పద్యాలను చెప్పించారు. అలాగే పట్టణానికి చెందిన శ్రీ సాయినటరాజ డ్యాన్స్ అకాడమీ భారతీదేవి విద్యార్థులకు కూచిపూడి నృత్యాన్ని నేర్పించారు. తెలుగు ఉపాధ్యాయుడు డి.నాగేశ్వరరావు, గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, బీడీసీ మల్లిక, సిబ్బంది శ్యామల, సత్యావతి, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

దేదీప్యమానంగా మహాయజ్ఞం



యజ్ఞంలో పాల్గొన్న రుత్వికులు



విజయవాడకల్చరల్: ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న అష్టోత్తర శత(108) కుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ యజ్ఞం రెండో రోజైన శనివారం దేదీప్యమానంగా కొనసాగింది. సాంస్కృతిక వేదికపై శనివారం సాయంత్రం కూచిపూడి నృత్య ప్రదర్శనలు నేత్ర పర్వంగా సాగాయి. రుత్వికులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భాగవతుల వేంకటరామశర్మ బృందం ప్రదర్శించిన నృత్యాంశాలు నేత్రపర్వంగా సాగాయి. పరమ భాగవోత్తముడు పోతన మహాకవి రచించిన శ్రీ కృష్ణలీలలను లీలా కృష్ణమ్ పేరుతో నృత్య రూపక ప్రదర్శన ఆహుతులను అలరించింది. శ్రీ కృష్ణుని జననం, బాల్యం, పూతన మరణం, చిటికెన వేళిపై గోవర్ధన గిరిని ఎత్తడం, కాళీయ మర్దనం, శకటాసుర సంహారం, కంసుని వధించే అంశాలుగా సాగిన నృత్యరూపకం ఆహుతులను కట్టిపడేసింది.

నేటి కార్యక్రమాలు

ఆదివారం ఉదయం 9 గంటల నుంచి హనుమాన్‌చాలీసా, చతుర్వేద పారాయణం, 11 గంటల నుంచి సుబుధేంద్ర తీర్థస్వామి అనుగ్రహ భాషణ, సాయంత్రం 5 గంటల నుంచి ఆచార్య కేవీ సత్యనారాయణ బృందం గోదా కల్యాణ నృత్యరూపకం, 6.30 గంటలకు చాగంటి కోటీశ్వరరావు ఆధ్యాత్మిక ప్రసంగం, రాత్రి 7.30 గంటలకు వీరవెంకట సత్యనారాయణ స్వామి కల్యాణం జరుగుతుంది.



డప్పులు వాయిస్తున్న కేరళ కళాకారులు



నృత్యం చేస్తున్న కళాకారులు

పద్మశాలీయ సంఘ సేవలు అభినందనీయం

ప్రభుత్వ విప్ ఉదయభాను



పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, పద్మశాలీయ సంఘ ప్రతినిధులు

జగ్గయ్యపేట అర్బన్: పద్మశాలీయ సంక్షేమ సంఘం చేస్తున్న సేవలు అభినందనీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో ఏర్పాటుచేసిన ఆయుర్వేద మజ్జిగ పంపిణీ కార్యక్రమం శనివారం 21 వ రోజుకు చేరుకుంది. సంగెపు రాజశేఖర్, యాపిల్ శ్రీను, కుక్కడపు సురేష్ సహకారంతో ఏర్పాటుచేసిన దద్దోజనం, ఐస్ క్రీమ్, అరటి పండ్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉదయభాను పాల్గొని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండిపోతున్న ఎండలకు గాను ఉపశమనంగా జగ్గయ్యపేట పద్మశాలీయ సంఘం వారు గత 20 రోజులుగా ఆయుర్వేద మజ్జిగతో పాటు పలు రకాలైన శీతల పానీయాలు పంపిణీ చేయడం స్ఫూర్తిదాయకమని చెప్పారు. ఇదే విధంగా సంఘ సభ్యులంతా ఐక్యతతో ముందుకు సాగుతూ పద్మశాలీయుల అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. తన వంతు సహకారాన్ని అందిస్తామని తెలిపారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.25 లక్షలు మంజూరు...

పద్మశాలీయుల శ్మశాన వాటిక అభివృద్ధికి ఎమ్మెల్యే ఉదయభాను రూ.25 లక్షలు మంజూరు చేసినట్లు సంఘ సభ్యులు తెలిపారు. అలాగే కమ్యూనిటీ భవన్‌కు కూడా నిధులు, స్థలం ఏర్పాటుచేస్తామని ఎమ్మెల్యే ఉదయభాను హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, విజయవాడ దుర్గ గుడి డైరెక్టర్ నంబూరి రవి, పద్మశాలీయుల సంఘ అధ్యక్షుడు పెనుమల్లి చంద్రమౌళి, కార్యదర్శి భారత జగన్, సంఘ ప్రతినిధులు అల్లి రవిచంద్, లక్ష్మీ కిషోర్, యలదండి శ్రీనివాస్, ఏనుగుల వీరబాబు, కుప్పడపు సురేష్, బొట్ల వీరభద్రం, పొట్టాబత్తిన రఘునాథ్, కర్నాటి రాజేశ్వరి, పాపాని రాజేశ్వరి, వెంకటలక్ష్మి, రామమ్మ, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు అన్ని విధాలా అండగా ఉంటా

ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్, వేదికపై నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాదిగ సామాజిక వర్గానికి తాను అన్ని విధాలా అండగా ఉంటానని ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ స్పష్టం చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయీస్ (మేడ్)-ఏపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. మేడ్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టిన సమయంలో సీఎం వైఎస్ జగన్ తనతో అన్న మాటలను ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ పదవి మొండితోక అరుణ్‌కుమార్‌కు ఇవ్వలేదని, మాదిగ జాతికి ఇచ్చానని చెప్పారన్నారు. మాదిగ జాతికి ఇచ్చిన ఈ పదవిని జాతి ప్రయోజనాల కోసమే ఉపయోగిస్తానన్నారు. మేడ్ నిరంతరం దళిత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై పనిచేయడం అభినందనీయమన్నారు. రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా సమస్యల సాధనకు కృషి చేయాలన్నారు. ఒక దళిత ఎమ్మెల్సీగా దళిత ఉద్యోగుల సంక్షేమం కోసం పనిచేయడం తన బాధ్యతని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో అనుకూల నిర్ణయాలు తీసుకునే విధంగా తన వంతు కృషి చేస్తానన్నారు. దళిత, బలహీన వర్గాల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. తొలుత మేడ్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ మాట్లాడుతూ.. మేడ్ దళిత ఉద్యోగుల హక్కుల సాధన వేదిక అని పేర్కొన్నారు. దళిత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై నినదించే గొంతుక అన్నారు. సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మేడ్ వ్యవస్థాపకుడు శృంగారపాటి శ్యామ్‌సుందర్, ప్రధాన కార్యదర్శి పొన్నూరి శామ్యుల్ జోబ్, ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.సునీల్‌కుమార్, ఎంఈవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆదూరి వెంకటరత్నం, మేడ్ ఉపాధ్యక్షురాలు పి.రాజ్యలక్ష్మి, అసోసియేషన్ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

నైపుణ్యాలతో విద్యార్థులకు ఉన్నత స్థాయి



మాట్లాడుతున్న ప్రవీణ్ కామత్

పరిటాల(కంచికచర్ల): మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో కెరీర్ డెవలప్‌మెంట్‌పై సెమినార్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శశిధర్ శనివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ విప్రో సాఫ్ట్‌వేర్ కంపెనీ లిమిటెడ్ హెచ్‌ఆర్ గ్లోబల్ ప్రవీణ్ కామత్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రోగ్రామింగ్, కోడింగ్ స్కిల్స్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. లాజికల్ థింకింగ్ ఉంటే సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీలో అత్యున్నత స్థానానికి చేరుకోవచ్చని చెప్పారు. విద్యార్థులు నిరంతరం అభ్యాసనం చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రస్తుతం ఐటీ రంగంలో ఎన్నో అవకాశాలున్నాయని, ఇంజినీరింగ్ బ్రాంచితో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ అడ్వాన్స్ టెక్నాలజీస్‌పై దృష్టి పెట్టాలని కోరారు. దీంతో పాటు సర్టిఫికెట్స్ కోర్సు చేయాలని పేర్కొన్నారు. కళాశాల కరస్పాండెంట్ కె.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న టెక్నాలజీని ఉపయోగించాలన్నారు. సెల్‌ఫోన్ భ్రమలో పడి విలువైన సమయాన్ని వృథా చేసుకోరాదని సూచించారు. అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి.చిరంజీవి, హెచ్‌ఓడీ డి.పవన్‌కుమార్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు ఈకేవైసీ తప్పనిసరి



మాట్లాడుతున్న పోతరాజు

కంచికచర్ల: ప్రభుత్వ పెన్షనర్లు ఈ ఏడాది మే 15వ తేదీలోగా తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ సంఘ కార్యదర్శి ముండ్లపాటి పోతరాజు అన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో కంచికచర్ల, వీరులపాడు మండలాల రిటైర్డ్ ఉద్యోగులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పెన్షనర్లు మొబైల్ ఫోన్ నెంబర్‌కు ఆధార్‌లింక్ చేయించుకోవాలని సూచించారు. కొంతమంది పెన్షనర్లు జీవన ధ్రువీకరణ పత్రాలు ఉప ఖజానా కార్యాలయానికి సమర్పించలేదని, ఇప్పటికైనా ఎస్‌టీఓకు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలన్నారు. ఈ ఏడాది జూన్ నెలలో ఇన్‌కంట్యాక్స్ రిటర్ను దఖలు చేయాలని సూచించారు. సమావేశంలో సంఘ కోశాధికారి నాగేశ్వరరావు, పెద్దినీడి కోటేశ్వరరావు, బి.కృష్ణమూర్తి బీవీ సర్వేశ్వరరావు, చాపలమడుగు స్వర్ణలత, మల్లికార్జునరావు, జానిమియా తదితరులు పాల్గొన్నారు.

వాటర్ స్పోర్ట్స్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం



శిక్షణ పొందుతున్న విద్యార్థులతో కార్పొరేటర్ రెహమతున్నీసా

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(శాప్), ఎన్టీఆర్ జిల్లా డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ(డీఎస్‌ఏ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ స్పోర్ట్స్ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా వాటర్ స్పోర్ట్స్‌లో శిక్షణ తీసుకుని రాణించాలని ఆకాంక్షించారు. వాటర్ స్పోర్ట్స్ కోచ్‌లు టి.నాగబాబు, ఎం.శ్రీను, కె.బాబూరావు మాట్లాడుతూ ఈ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో మొత్తం 42 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ఈవెంట్స్‌లో కయాకింగ్ స్పోర్ట్స్‌లో భాగంగా కె-1 (సింగిల్), కె-2 (ఇద్దరు), కె-4 (నలుగురు) విభాగాల్లో 200, 500, 1000 మీటర్ల చొప్పున నదిలో పడవలో ప్రయాణిస్తారన్నారు. అలాగే కెనోయింగ్ ఈవెంట్‌లో సీ-1, సీ-2, సీ-4 విభాగాల్లో పాల్గొంటారని వివరించారు. ఈ క్యాంప్ ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి 8.30 గంటల వరకు కొనసాగుతుందని చెప్పారు.